డబ్బులిస్తామని పిలిచి..

తిరుపతి క్రైమ్: మెడికల్ డిస్ట్రిబ్యూటర్‌పై ఓ మహిళతో పాటు మరికొందరు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరానికి చెందిన మెడికల్ డిస్ట్రిబ్యూటర్ చరణ్‌కు తన ఏజెన్సీలో పనిచేసే కనిమొళితో సన్నిహిత సంబంధం ఏర్పడింది. కొన్నాళ్లకు వారు సహజీవనం చేశారు. ఈ నేపథ్యంలో చరణ్ ఆమెకు అవసరాల నిమిత్తం సుమారు రూ.9 లక్షల వరకు ఇచ్చాడు. కొన్నాళ్లకు కనిమొళి మద్యం తాగుతూ విచిత్రంగా ప్రవర్తిస్తుండడంతో దూరం పెట్టాడు. దీంతో అతను తనకు ఎక్కడ దూరం అవుతాడో అనే ఉద్దేశంతో షాపు వద్దకు వచ్చి చాలాసార్లు గొడవకు దిగింది. ఈ నెల 1వ తేదీ ఆమె చరణ్‌కు ఫోన్ చేసి డబ్బులు ఇస్తామని ఇంటికి రమ్మని ఫోన్ చేయడంతో వెళ్లాడు. ఆ సమయంలో అతనిపై కనిమొళితో పాటు రవి, ఇనాం బరుస రవి, చంద్రకళ, గీత మరికొందరు కలసి కర్రలు, ఇనుప రాడ్లతో కొట్టి గాయపరిచారు. దీనిపై బాధితుడు చరణ్ ఫిర్యాదు చేయడంతో విచారించి చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

తెలియని వ్యక్తులకు జామీను ఇచ్చి..!

తిరుపతి లీగల్: ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తమిళనాడుకు చెందిన ఆరుగురు నిందితులకు డబ్బుకు ఆశపడి జామీను ఇచ్చారు. నిందితులు కోర్టుకు హాజరు కాకపోవడంతో తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ కోర్టు జడ్జి నరసింహమూర్తి జామీను ఇచ్చిన ఇద్దరు జామీను దారులు ఒక్కొక్కరు లక్ష రూపాయలు జరిమానా చెల్లించాలని మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలు.. 2017లో ఐరాల పోలీస్ స్టేషన్ పరిధిలో తమిళనాడు, తిరువణ్ణామలై జిల్లా, పోలారు తాలూకా, పెరియవళ్లి గ్రామానికి చెందిన ఏ.రమేష్, ఏ.కుమార్, డీ.చిన్నస్వామి, ఏ.సుధాకర్, పీ.ఏలుమలై, ఏ.దేవేంద్రలు ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. అన్నమయ్య జిల్లా, పీలేరు మండలం, దొడ్డిపల్లి సమీపంలోని బలిజపల్లికి చెందిన సి.నాగరాజ, అన్నమయ్య జిల్లా, పీలేరు మండలం, శివరాంపల్లికి చెందిన కే.మునిరాజాతో సహా ఆరుగురు నిందితులకు రూ.20 వేల చొప్పున జామీను ఇచ్చారు. దీంతో కోర్టు వారికి బెయిల్ మంజూరు చేసింది. కేసు విచారణ దశలో నాలుగో నిందితుడు ఏ.సుధాకర్ మృతి చెందాడు. కేసు విచారణకు ఐదుగురు నిందితులు హాజరు కాలేదు. దీంతో కోర్టు ఐదుగురు నిందితులను కోర్టులో హాజరుపరచాలని నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీనిపై పోలీసులు నిందితులను కోర్టులో హాజరు పరచలేక పోయారు. ఐదుగురు నిందితులకు జామీను ఇచ్చిన నాగరాజా, మునిరాజాను కోర్టులో హాజరుపరచాలని న్యాయమూర్తి ఆదేశించారు. పోలీసులు ఇద్దరు జామీను దారులను కోర్టులో హాజరపరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు 300 మంది గైర్హాజరు

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్–1 మెయిన్స్ రాత పరీక్షకు 300 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 911 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 611 మంది మాత్రమే వచ్చారని తెలియజేశారు. ఆయా కేంద్రాల్లో అభ్యర్థులకు తాగునీటితోపాటు అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు.

రాజకీయ చట్రంలో సత్యవేడు!

- ఎమ్మెల్యే ఒకరు.. పెత్తనం మరికొందరిది
- నాడు విమర్శలు చేసి.. నేడు చేస్తున్నదేమిటో?
- సత్యవేడులో ఆ సామాజికవర్గం వారే పెత్తందారులు
- సస్పెన్షన్‌తో ఎమ్మెల్యేను పక్కనబెట్టిన టీడీపీ అధిష్టానం
- నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా గ్రావెల్, ఇసుక దోపిడీ
- మంత్రి లోకేష్ పర్యటనలో సత్యవేడు టీడీపీలో లుకలుకలు



వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం నుంచి తమిళనాడుకు గ్రావెల్ తరలింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్: సత్యవేడు నియోజకవర్గం రాజకీయ చట్రంలో చిక్కుకుంది. స్థానిక ఎమ్మెల్యే సస్పెన్షన్‌కు గురైనప్పటి నుంచి ఆ నలుగురు నేతలు తానే ఎమ్మెల్యేనంటూ పెత్తనం చెలాయిస్తున్నారు. ఆ నలుగురు కూడా చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వారే కావడం గమనార్హం. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు ఉమ్మడి జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనే ప్రత్యేకం. శ్రీసిటీ ఉండడమే అందుకు నిదర్శనం. ఈ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు స్థానం. ప్రస్తుతం ఆదిమూలం ఎమ్మెల్యే. ఎన్నికలముందు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి జంప్ అయ్యారు. స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. ఆ తర్వాత ఓ మహిళను లైంగికంగా వేధించారని బాధిత మహిళ మీడియా ముందుకొచ్చి చెప్పడంతో ఎమ్మెల్యే ఆదిమూలంను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

పెత్తందారుల చేతుల్లోకి సత్యవేడు

ఎమ్మెల్యేని సస్పెండ్ చేయడంతో సత్యవేడు నియోజకవర్గంలో చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన నలుగురు రంగప్రవేశం చేశారు. ఎన్నికల ముందు పరిశీలకుడిగా వచ్చిన చంద్రశేఖర్‌నాయుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త గంగాప్రసాద్, కో–ఆర్డినేటర్ పేరుతో శ్రీపతిబాబు సత్యవేడులో పెత్తనం చెలాయిస్తున్నారు. గంగాప్రసాద్ మాత్రం తెరవెనుక నుంచి రాజకీయం నడిపిస్తుంటారనే ప్రచారం ఉంది. తాజాగా మంత్రి నారా లోకేష్ పర్యటన ఖరారు కావడంతో మరో కమ్మసామాజిక వర్గానికి చెందిన శాప్ చైర్మన్ రవినాయుడు రంగంలోకి దిగారు. ఆ ముగ్గురే అనుకుంటే.. కొత్తగా మరొకరు వచ్చారంటూ నియోజకవర్గంలో కూటమిలో చర్చనీయాంశంగా మారింది.



సత్యవేడు: సిమెంటు రోడ్డు ప్రారంభోత్సవంలో చంద్రశేఖర్ నాయుడు, శ్రీపతి బాబు (ఫైల్)

దళిత నియోజకవర్గంలో పెత్తందారీ వ్యవస్థ

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సస్పెన్షన్‌ని ఆసరాగా చేసుకుని సత్యవేడులో పెత్తందారి వ్యవస్థకు నాంది పలికింది. అప్పటి నుంచి నియోజకవర్గంలో ఏదో ఒక అలజడి సృష్టిస్తూ ఎమ్మెల్యేను సోషల్ మీడియా వేదికగా వ్యతిరేకవర్గం విమర్శనాస్త్రాలను సంధిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సత్యవేడు నియోజకవర్గంలో పెత్తందారుల పాలన నడుస్తోందని ఎమ్మెల్యే ఆదిమూలంతో పాటు, టీడీపీ నేతలు పెద్ద ఎత్తున అసత్య ప్రచారాలు చేశారు. ఆ ప్రచారాలను తన ఎల్లోమీడియా ద్వారా విషప్రచారం చేయించారు. కూటమి నేతలు అదే వ్యక్తిని టీడీపీలోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే అయ్యాక ఆదిమూలం బండారం బట్టబయలు అయ్యింది. వైఎస్సార్‌సీపీ మంచి నిర్ణయమే తీసుకుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. నేడు సత్యవేడు నియోజకవర్గంలో జరుగుతున్నది పూర్తిగా టీడీపీ పెత్తందారుల పెత్తనమే కదా..? అని స్థానికులు అంటున్నారు. అందుకు నిదర్శనమే అక్రమ అనుమతులతో పక్క నియోజకవర్గానికి చెందిన పారిశ్రామికవేత్త తన బినామీల ద్వారా పెద్ద ఎత్తున గ్రావెల్, ఇసుక తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అంతేగాక తెర వెనుక ఆయనే పెత్తందారుడిగా వ్యవహరిస్తూ ఆయన చెప్పిన అధికారులనే నియమించుకున్నారు. సీఎం చంద్రబాబు అనుచరుడిగా, వ్యాపారవేత్తగా చలామణి అవుతూ సత్యవేడు నియోజకవర్గంలో పెత్తనం చెలాయిస్తున్నారు. ఇలాంటి వారిపై మంత్రి లోకేష్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

తరలిపోతున్న సత్యవేడు సంపద

సార్వత్రిక ఎన్నికల సమయంలో నియోజకవర్గం పరిశీలకుడిగా ప్రవేశించి నేడు సత్యవేడు చంద్రుడుగా సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్న చంద్రశేఖర్ నాయుడు, సూళ్లూరుపేటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గంగాప్రసాద్ అనుచరుడు సత్యవేడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అని చెప్పుకుంటున్న శ్రీపతిబాబు ఎమ్మెల్యే కాకపోయినా ఎమ్మెల్యే హోదాలో పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ హడావుడి చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రధాన సంపదగా ఉన్న గ్రావెల్, మట్టి, ఇసుకను తమిళనాడు సరిహద్దులను దాటించి పెద్ద మొత్తంలో లాభార్జన పొందుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ అక్రమ రవాణాను గ్రామస్తులు అడ్డుకున్నప్పటికీ ఖాతరు చేయడం లేదు.

ట్రాఫిక్ నియంత్రణకు రైల్వే అండర్‌పాస్‌లు



రేణిగుంట వద్ద రైల్వే అండర్‌పాస్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం : తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ కష్టాలను నియంత్రించేందుకు రైల్వే అండర్ పాస్ నిర్మాణాలు చేపడుతున్నట్టు ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. తిరుపతి నగర పరిధిలోని హీరోహోండా షోరూమ్ ఎదురుగా, శెట్టిపల్లి వద్ద రైల్వే అధికారులు నిర్మిస్తున్న రైల్వే అండర్‌పాస్ నిర్మాణాలను మంగళవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. రైల్వే అండర్‌పాస్ నిర్మాణాల్లో నాణ్యతను పరిశీలించి ఎంత ఎత్తు నిర్మిస్తున్నారు, అండర్ పాస్‌లో నిలబడి వరదనీరు బయటకు పంపేందుకు చేస్తున్న ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెస్ట్ చర్చ్, ఆర్‌సీరోడ్డు, ఈస్ట్ పోలీస్టేషన్ ప్రాంతాల్లో ఉన్న సమస్యలు ఇక్కడ లేకుండా చూడాలన్నారు. భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా గత వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సహకారంతో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా ఉన్న భూమన అభినయ్‌రెడ్డి అనేక మాస్టర్‌ప్లాన్ రోడ్లను నిర్మించారని గుర్తుచేశారు. అయితే తిరుపతి నగరంలోని రైల్వే మార్గాల్లో గేట్లను పదే పదే వేస్తుండడంతో వాహనదారులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయంపై కేంద్ర రైల్వేశాఖ మంత్రితో చర్చించి రూ.12 కోట్లతో తిరుపతి–రేణిగుంట రోడ్డులోని హీరోహోండా షోరూం, శెట్టిపల్లి వద్ద రెండు రైల్వే అండర్‌పాస్ నిర్మాణాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు.

చచ్చేవరకు జగనన్నతోనే



బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి : నేను బతికున్నంత కాలం జగనన్నతోనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియాలో మాజీ ఎమ్మెల్యే రాజకీయాలకు దూరంగా ఉన్నాడంటూ ప్రచారం చేయడంపై ఆయన గట్టిగానే సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా కేసులు నమోదవుతున్న నియోజకవర్గంలో శ్రీకాళహస్తిని చెప్పుకోవాలని తెలిపారు. జనసేన, టీడీపీ కొట్టుకుని ఒకరి ఫ్లెక్సీలు ఒకరు చింపుకుంటుంటే దాన్ని వీడియో తీసిన విలేకరిపైన, అతనిని ఇంటికాడ వదిలేసి వస్తున్న మరో విలేకరిపైన అమానుషంగా దాడులు చేయడం దారుణమన్నారు. రాయలసీమలో కొన్ని ఏరియాల్లో మాత్రమే జరిగే గొడవలను శ్రీకాళహస్తికి తెచ్చేశారన్నారు. పచ్చగా పండిన పైర్లను దున్నేస్తున్నారని, ఇంటి నిర్మాణం కోసం తెచ్చిపెట్టుకున్న విలువైన కలపను తగలబెట్టేస్తున్నారని, అంతా హిట్లర్ పాలన తలపిస్తోందని ధ్వజమెత్తారు. టీడీపీకి సంబంధించిన ఏదో ఒక సోషల్ మీడియాలో ఏదో ఒకటి ప్రచారం చేస్తే దానికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాల్లోకి మొదటి అడుగు వేసే నాటికి తాము ఆయన వెనకాల ఉన్నామని, ఆయన పేరుతో జగన్ చారిటబుల్ ట్రస్ట్ పెట్టి సేవ చేశానని పేర్కొన్నారు. 'నా ప్రాణం ఉన్నంతవరకు జగనన్నతోనే నా ప్రయాణం ఉంటుంది' అని స్పష్టం చేశారు. జగనన్న కోసమే బెంగళూరులో వ్యాపారాలు వదులుకొని శ్రీకాళహస్తి వచ్చినట్టు తెలిపారు. కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చడం మానేసి కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీకాళహస్తిలో మీడియా సోదరులు కూడా స్వతంత్రంగా వార్తలు రాయలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా కూటమి అరాచకాలు ఆపి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

యథేచ్ఛగా ఆక్రమణ

ప్రభుత్వ నిధులతో అక్రమ నిర్మాణాలు

- ఆక్రమదారులకు సహరిస్తున్న అధికారులు
- అధికారులపై విరుచుకుపడుతున్న స్థానికులు



ప్రభుత్వ భూమిలో నిర్మించిన గోకులం షెడ్డు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పచ్చనేతలు చంద్రగిరి నియోజకవర్గంలో చెలరేగిపోతున్నారు. అధికారులను అడ్డు పెట్టుకుని కబ్జాల పరంపర కొనసాగిస్తూనే ఉన్నారు. ఖాళీ జాగా కనబడితే చాలు ఆక్కడ గద్దల్లా వాలిపోతున్నారు. దర్జాగా కబ్జా చేసి నిర్మాణాలు సాగిస్తున్నారు. ఆపై వాటికి ప్రభుత్వ నిధులు మంజురు చేసుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారు. ఇలాంటిదే ఎర్రావారిపాళెంమండలంలో వివాదాస్పందంగా మారింది.

అసలేం జరిగిందంటే

ఎర్రావారిపాళెం మండలం, ఉస్తికాయాలపెంట గ్రామ క్రాస్‌లో గ్రామ రెవెన్యూ లెక్కదాఖల సర్వే నం.191లో దాదాపు 10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి ప్రభుత్వ భూమి అని అధికారులు బోర్డులు కూడా పెట్టారు. ఈ భూమిలో ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారులు ప్రయత్నించడంతో అప్పుడు టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమి, గుట్ట ప్రాంతంలో భవనాలు ఎలా నిర్మిస్తారని గగ్గోలు పెట్టారు. అక్కడ రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేసేందుకు ప్రయత్నించినా అడ్డుకున్నారు. ఈ క్రమంలో గ్రామంలో రైతు భరోసా భవనానికి శాశ్వత భవనం లేకుండా పోయింది.



ప్రభుత్వ భూమి అని ఏర్పాటు చేసిన బోర్డు

అధికార అండతో అక్రమ నిర్మాణాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలు రెచ్చిపోయారు. ప్రభుత్వ భవనాలు నిర్మించకూడదనే స్థలంలోనే అధికార పార్టీ నేతలు ఆక్రమించుకుని అక్రమ కట్టడాలకు పూనుకున్నారు. ప్రభుత్వం రైతుల కోసం గోకులం షెడ్లు మంజూరు చేయగా.. సదరు స్థలంలో దర్జాగా గోకులం షెడ్డును నిర్మించారు. గోకులం షెడ్ కాకుండా ఇతర నేతలు సైతం భూమిని ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. ఇక్కడ నిర్మించిన గోకులం షెడ్‌కు ప్రభుత్వ అధికారులు అనుమతులు ఇవ్వడం, ఆ షెడ్డుకు ఉపాధి నిధులు మంజూరు చేయడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై సాక్షత్తూ మండల మీట్లో ప్రజాప్రతినిధులను ప్రశ్నించినా అధికారులు చూస్తాం.. సర్వే చేస్తామంటూ కాలయాపన చేయడంపై స్థానికులు మండిపడుతున్నారు.

> **నివేదికలు వచ్చిన తర్వాత చర్యలు**
>
> ఎర్రావారిపాళెం మండలం, ఉస్తికాయాల పెంట గ్రామ శివార్లలోని ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాల విషయం మా దృష్టికి వచ్చింది. వీఆర్వో, ఆర్ఐ, మండల సర్వేయర్ సమక్షంలో సర్వే చేయిస్తాం. వారు నివేదిక ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటాం.
>
> – పరమేశ్వరస్వామి, తహసీల్దార్, ఎర్రావారిపాళెం మండలం
>
> **మా దృష్టికి రాలేదు**
>
> ఎర్రావారిపాళెం మండలం, ఉస్తికారయాల పెంట గ్రామ శివార్లలోని ప్రభుత్వ భూమిలో గోకులం షెడ్ నిర్మించిన విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే బిల్లులు చర్యలు తీసుకుంటాం. బిల్లులు మంజూరు చేయకుండా అడ్డుకుంటాం.
>
> – మహేష్, ఏపీఓ

పిడుగు పడి తాటి చెట్టు దగ్ధం

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట మండలం, మన్నేముత్తేరి గ్రామంలో మంగళవారం సాయంత్రం తాటి చెట్టుపై పిడుగు పడింది. హఠాత్తుగా మంటలు అంటుకున్నాయి. ఉరుములు, మేరుపులతో పాటు వర్షం రావడంతో స్థానికులు వణికిపోయారు. తీవ్రమైన ఈదురు గాలులతో భయపడి పోయారు.

నోటీస్ బోర్డు

- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9 గంటలకు సీపీఎం జిల్లా కమిటీ మీడియా సమావేశం
- జిల్లాలో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు తిరిగి 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు షిఫ్టులుగా ఏపీ ఐసెట్–2025 పరీక్షలు
- ఎస్వీ వేద యూనివర్సిటీలో ఉదయం 10 గంటల నుంచి వైదిక, యోగా వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం
- కొత్తవీధిలోని శ్రీకన్యకా పరమేశ్వరి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం 6 గంటలకు పురవీధులలో అమ్మవారి ఊరేగింపు, 416 మంది ఆర్యవైశ్య మహిళలచే అమ్మవారికి సర్వదేవతా సమ్మోహన హారతుల సమర్పణ
- జిల్లాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీపీఎస్సీ గ్రూప్–1 సర్వీస్ మెయిన్ పరీక్షలు
- అన్నమాచార్య కళామందిరంలో సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్‌చే 'విరాటపర్వం'పై ప్రసంగం
- ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు చిరుగువాడ, తిరుచానూరు, చెర్లోపల్లి, మంగళం–2 సచివాలయాల్లో రెండవ రోజు 6 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్, 15 ఏళ్లలోపు పిల్లలకు బయోమెట్రిక్ నమోదు

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి వాచ్‌మన్ మృతి




మృతి చెందిన మునిశేఖర్ (ఫైల్)

తిరుపతి రూరల్: పూతలపట్టు – నాయుడుపేట జాతీయ రహదారికి ఆనుకుని తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గార్డెన్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఓ వ్యక్తి సోమవారం అర్ధరాత్రి కాలుజారి కింద పడడంతో మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. రేణిగుంట మండలం, అన్నసామిపల్లికి చెందిన మునిశేఖర్ (32) 2020 నుంచి గార్డెన్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ 6వ అంతస్తులోని పెంట్ హౌస్‌లో నివాసముంటున్నాడు. మునిశేఖర్ భార్య రోజావతి అక్కడే స్వీపర్‌గా పనిచేస్తుండగా.. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మునిశేఖర్ మద్యం మత్తులో 6వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. ఆ వెంటనే అపార్ట్‌మెంట్ వాసులు చికిత్స నిమిత్తం అతన్ని రుయా ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని తల్లిదండ్రులు ఇప్పటికే చనిపోవడంతో అతనికి భార్య పిల్లలు తప్ప ఎవ్వరూ లేరు. మృతుని భార్య రోజావతి ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.


సమన్వయంతోనే బర్డ్ సేవలు

తిరుపతి తుడా: బర్డ్ ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు, అధికారులు సమన్వయంతోనే వైద్య సేవలను అందిస్తున్నామని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. బర్డ్ ఆసుపత్రిలో రోగుల ఇబ్బందులు, వైద్య సేవలపై మంగళవారం సాక్షి దినపత్రికలో 'గాడి తప్పిన పాలన' శీర్షికతో ప్రచురించిన కథనంపై టీటీడీ ప్రకటన విడుదల చేసింది. ఆ స్పత్రిలో అవసరమైన స్పెషలిస్ట్ వైద్యులు ఉన్నారని, అలానే వివిధ ప్రాంతాల నుంచి ప్రతినెలా ప్రముఖ వైద్యులు బర్డ్ ఆసుపత్రికి వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారని పేర్కొంది. వివిధ శస్త్ర చికిత్సల తేదీల ఖరారు విషయంలో రోగుల తీవ్రతను బట్టి అపాయింట్‌మెంట్ తేదీలను ఖరారు చేస్తారని, బీపీఎస్ కింద రోజుకు 5 లేదా ఆరుగురు రోగులకు మాత్రమే అపాయింట్‌మెంట్ తేదీలు ఇస్తారని తెలియజేసింది.

మద్యం మత్తులో హల్‌చల్



మద్యం మత్తులో పడి ఉన్న డ్రైవర్



వాహనం ఢీకొనడంతో దెబ్బతిన్న కారు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): మద్యం మత్తులో ఓ డ్రైవర్ చెలరేగిపోయాడు. అతివేగంగా బొలెరో వాహనాన్ని నడిపి అడ్డొచ్చిన వాహనాల్ని ఢీకొట్టాడు. ఈ ఘటన రేణిగుంటలో చోటు చేసుకుంది. వివరాలు.. తిరుపతి వైపు నుంచి మంగళవారం రాత్రి 8.30 గంటలకు బొలెరో వాహనం అతి వేగంగా వచ్చి అంబేడ్కర్ విగ్రహం కూడలి వద్ద దంపతులు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడక్కాపై అతివేగంగా వెళ్లి డాక్టర్ జనార్దన్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న సర్కిల్‌లో ఆపి ఉన్న తమిళనాడు బస్సును, కారును ఢీకొని అదే వేగంతో దూసుకెళ్లాడు. స్థానికులు వెంబడించడంతో వేణుగోపాలపురం ఊరి నుంచి వడ్డిమిట్ట మీదుగా అతివేగంగా వెళ్లడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంబడించి రేణిగుంట పారిశ్రామిక వాడలో పట్టుకున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో నిలబడే పరిస్థితుల్లో కూడా లేకుండా ఉండడంతో పోలీసులకు అప్పగించారు.

నిద్రలో లేచి.. భవనం పై నుంచి దూకి..!

తిరుపతి క్రైమ్: అపార్ట్మెంట్ పైనుంచి దూకి ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన మంగళవారం వేకువజామున తిరుపతిలోని బ్యాంకు కాలనీలో చోటుచేసుకుంది. అలిపిరి ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాలు .. వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురానికి చెందిన రమేష్ కుమారుడు నరేంద్రకుమార్ (13) ఏడవ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో నరేంద్ర బ్యాంక్ కాలనీలో ఉన్న చిన్నాన్న విశ్వనాథం వద్దకు వచ్చాడు. విశ్వనాథం కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు.ఇంట్లో ఎక్కువ వేడి ఉండడం వల్ల అపార్ట్మెంట్ ఆరో అంతస్తుపై నిద్రించారు. ఏమైందో ఏమోగానీ నరేంద్ర నిద్రలో లేచి పైనుంచి కిందకు దూకాడు. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. విశ్వనాథం కుటుంబ సభ్యులకు ఇది దిగ్భ్రాంతి కలిగించింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతికి కారణాలేమిటో పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

తిరుచానూరు నుంచి మామిడి ఎగుమతులు



విదేశాలకు ఎగుమతి చేయనున్న మామిడిపండ్ల ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కృష్ణబాబు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, తిరుచానూరు మార్కెట్ యార్డు నుంచి విదేశాలకు మామిడి ఎగుమతులు ప్రారంభమయ్యాయి. గత ఐదేళ్ల నుంచి మామిడి ఎగుమతులు చేస్తున్నప్పటికీ ఈ ఏడాది సీజన్ ఆరంభంలోనే రోజుకు పది టన్నుల వరకు ఎగుమతి చేస్తున్నట్టు అక్కడి అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌చార్జ్ ఎం.టి కృష్ణబాబు ఫ్యామిలీ వెల్ఫేర్ కమీషనర్ వీర పాండ్యన్‌తో కలిసి మంగళవారం వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. ముందుగా మార్కెట్ యార్డులోని మామిడి ఎగుమతి కేంద్రాన్ని తనిఖీ చేశారు. వేపర్ హీట ట్రీట్మెంట్ ద్వారా జరుగుతున్న మామిడి కాయల క్లీనింగ్, కూలింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్ విధాలను కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌తో కలసి పరిశీలించారు. మామిడికాయలను నెదర్లాండ్, జర్మనీ, యూకే, న్యూజీలాండ్, సౌత్ కొరియా, ఇటలీ, జపాన్, సింగపూర్ వంటి దేశాలకు ఎగుమతి చేస్తున్నట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, ఆర్డీఓ రామ్మోహన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా నీటి సేద్య అధికారి సతీష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలకృష్ణ నాయక్, డీసీహెచ్ ఆనందమూర్తి పాల్గొన్నారు.

మా మైనింగ్ పరిశ్రమను రాజకీయం చేయొద్దు

వెంకటగిరి రూరల్: 'మా మైనింగ్ పరిశ్రమను రాజకీయం చేయొద్దు' అని శ్రీకళ్యాణరామ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ సర్వజ్ఞ యాచేంద్ర మంగళవారం పేర్కొన్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, సైదాపురం మండలం, శ్రీకల్యాణరామ కంపెనీకి కలిచేడు, గోగుల బృందావనం గ్రామాల్లో రెండు మైనింగ్ గనులున్నాయని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1920–30 నుంచి నేటి వరకు ఆయా మైకా పరిశ్రమల్లో మైకా, క్వార్ట్ ఫెల్డ్‌ఫర్ క్వారీలను మచ్చలేని రికార్డులతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం తమ ఐదో తరం కుటుంబ సభ్యులతో సహా క్వారీ కార్యకలాపాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నట్టు పేర్కొన్నారు. తమ కంపెనీలకు సంబంధించి మైనింగ్ పరిశ్రమను రాజకీయం చేయొద్దని కోరారు.

క్లుప్తంగా

గంగ జాతర ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా ఆలయ పరిసరాల్లో జరుగుతున్న ఏర్పాట్లను నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చే మార్గంలో ఇబ్బందులు కలగకుండా మార్కింగ్ చేయా లని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అన్ని మార్గాల్లో చర్యలు తీసుకోవాలని, పొంగళ్లు పెట్టే ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. తాగునీటి కౌంటర్లు ఏర్పాటు చేయాలని, జాతర సమయంలో భక్తులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. వృద్ధులు, పిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆలయంలో ప్రదక్షిణ లు చేసే సమయంలో, దర్శనానికి వెళ్లే మార్గంలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కమిషనర్ వెంట డీఎస్పీ భక్తవత్సలం, సూపరింటెండెంట్ ఇంజినీర్లు శ్యాంసుందర్, కృష్ణారెడ్డి, ఈఈలు తులసి కుమార్, రవీంద్ర, ఆలయ ఈఓ జయకుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి ఉన్నారు.

ఎస్వీసీఈలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులను పరామర్శిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి

తిరుపతి సిటీ: స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈలో మంగళవారం జరిగిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రాస్ వ్యవస్థాపక కార్యదర్శి పద్మశ్రీ గుత్తా మునిరత్నం నాలుగో వర్ధంతి సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 50మందికి పైగా విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి రక్తదానం చేసిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రుయా బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జ్ డాక్టర్ హరిత, రాస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగరాజు, ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుట్టను తవ్వి.. మట్టిని తరలించి..



రామాపురం ఎస్టీకాలనీ వద్ద గుట్టను తవ్వేస్తున్న అక్రమార్కులు

తిరుపతి రూరల్ (రామచంద్రాపురం) : రామచంద్రాపురం మండలం సి.రామాపురం పంచాయతీ రామాపురం ఎస్టీ కాలనీ వద్ద సర్వే నంబరు 101లోని ప్రభుత్వ భూమి (గుట్ట)ని మట్టి అక్రమార్కులు కబ్జా చేశారు. గుట్టుగా గుట్టను తవ్వి మట్టిని తరలించేస్తున్నారు. గత వారం రోజులుగా కమ్మకండ్రిగ పంచాయతీకి చెందిన వారు మట్టిని తవ్వుకుని అక్రమంగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. మట్టి తవ్వకాలను అడ్డుకునేందుకు ప్రయత్నించగా భౌతిక దాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ సంపాదనకు అలవాటు పడిన మట్టి అక్రమార్కులు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. మట్టి మాఫియాపై జిల్లా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన విరాటపర్వం



ప్రసంగిస్తున్న సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్

తిరుపతి కల్చరల్: మానవ మనస్తత్వాన్ని ఆవిష్కరించిన మహాగ్రంథం మహాభారతమని సరస్వతీ పుత్రుడు, పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ ఉద్ఘాటించారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నాలుగురోజుల పాటు తలపెట్టి న 'విరాటపర్వం' ప్రసంగ ప్రవచన కార్యక్రమం మంగళవారం అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ధర్మం కోసం అరణ్యవాసం, అజ్ఞాతవాసం చేసిన పాండవులు నిజమైన ధర్మ రక్షకులని కొనియాడారు. ముఖ్యఅతిథిగా విచ్చే సిన మాజీ ఎమ్మెల్యే చదలవాడ కృష్ణమూర్తి, హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రత్యేకాధికారి శ్రీరామ్ రఘునాథ్ మాట్లాడుతూ విరాటపర్వం నిర్ణయించిన రోజే వర్షం పడడం సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి సురేంద్రనాయుడు, డాక్టర్ లక్ష్మి, ఆచార్య దేవసేన నాయుడు, జీఎల్ మనోహర్, ఏపీ నాయుడు, నగర ప్రజలు పాల్గొన్నారు.

మీకు దిక్కున్న చోట చెప్పుకోండి

కూటమి నాయకుల కంటికి ఏది కనిపించినా వదిలేలా లేరు. అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ప్రకృతిని చెరబడుతున్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని చేయని అక్రమం అంటూ లేదు. తాజాగా చంద్రగిరి మండలంలోని మఠంపల్లిలో టీడీపీ నేతలు బరితెగించారు. నీటి తొట్టి నిర్మాణం పేరుతో ఉపాధి నిధులతో నిర్మించిన ఆనకట్టపై అక్రమంగా గ్రావెల్‌ను తరలించారు. ఇదేమిటని ప్రశ్నించిన గ్రామస్తులపై బెదిరింపులకు పాల్పడ్డారు.



మఠంపల్లి శివాలయం సమీపంలోని ఆనకట్ట నుంచి అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న దృశ్యం

- మఠంపల్లిలో టీడీపీ నాయకుల బరితెగింపు
- ఉపాధి నిధులతో నిర్మించిన ఆనకట్టపై మట్టి అక్రమ రవాణా
- నిలదీసిన గ్రామస్తులు
- మా ప్రభుత్వం.. మా ఇష్టం వచ్చినట్లు చేస్తామంటూ బెదిరింపులు
- మట్టి తోలుకునేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్న రెవెన్యూ అధికారులు

చంద్రగిరి: మండలంలోని మఠంపల్లి గ్రామ సమీపంలోని శివాలయం వద్ద కొన్నేళ్ల క్రితం ఉపాధిహామీ పథకం కింద నీటి కుంటలను ఏర్పాటు చేశారు. ఆపై చెరువు నుంచి వరద నీరు ఆలయం వైపు రాకుండా ఆనకట్ట నిర్మించారు. ఈ క్రమంలో గత మూడు రోజులుగా అధికార పార్టీకి చెందిన కూటమి నేతలు కట్టను స్వాహా చేసేందుకు సన్నద్ధమయ్యారు. జేసీబీలు, ట్రాక్టర్ల ద్వారా కట్టను ధ్వంసం చేసి అక్కడ నుంచి మట్టిని అక్రమంగా రవాణాకు పూనుకున్నారు. రెండు రోజులుగా అక్రమ గ్రావెల్ తరలింపుపై గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

మా ప్రభుత్వం .. మా ఇష్టం..

స్థానికంగా ఉండే రెవెన్యూ సిబ్బంది అలాంటిదేమీ జరగలేదంటూ ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం అందిస్తూ అధికార పార్టీ నేతలకు సహకరిస్తున్నారని మఠంపల్లి గ్రామస్తులు మండిపడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం మరోసారి మట్టిని తరలించడంపై గ్రామస్తులు కూటమి నేతలను నిలదీశారు. దీంతో వారు 'మా ప్రభుత్వం మా ఇష్టం వచ్చినట్లు చేస్తాం..మీకు దిక్కున్న చోటుకు వెళ్లి చెప్పుకోండంటూ బెదిరింపులకు పాల్పడినట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శివాలయం సమీపంలో నీటితొట్టి ని ర్మాణానికి ఆనకట్టపై ఉన్న మట్టిని తరలించడం ద్వారా భవిష్యత్తులో భారీ వర్షాలు కురిస్తే ఆల యం దెబ్బతినే ప్రమాదముందని, కాంట్రాక్టర్ ద్వారా కూటమి నేతలు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి రెవెన్యూ ఉన్నతాధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో మట్టిని తరలింపును నిలిపివేసి అక్కడ నుంచి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. గ్రావెల్ తరలింపుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, పరిశీలించి మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటామన్నారు.

పల్లెలకు జాతర శోభ



సి.గొల్లపల్లిలో నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న వైస్ ఎంపీపీ మాధవరెడ్డి

- నేడు 20 గ్రామాల్లో గంగజాతర
- అమ్మవారికి సారె సమర్పించనున్న చెవిరెడ్డి కుటుంబం

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలంలోని గ్రామాలకు జాతర శోభ సంతరించుకుంది. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర చాటింపు రోజున అవిలాల గ్రామం నుంచి అమ్మవారికి పసుపు కుంకుమ పంపడం ఆనవాయితీ. అదే రోజున తిరుపతి రూరల్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో జాతర నిర్వహిస్తారు.

నేడు 20 గ్రామాల్లో గంగమ్మలకు సారె సమర్పణ

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పల్లెల్లో గంగమ్మ జాతర్లకు సారెను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. జాతర నిర్వహించే ప్రతి పల్లెకు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి కుటుంబ సభ్యులు సారెను తీసుకువెళ్లి సమర్పిస్తారు. అందులో భాగంగా బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 12 గ్రామాల్లో చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సారెను సమర్పిస్తారు. అనంతరం నడివీధి గంగమ్మలను దర్శించుకుంటారు. అదేవిధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఉదయం 7గంటల నుంచే ఎనిమిది గ్రామాల్లో సారెను సమర్పించి గంగమ్మలను దర్శించనున్నారు. చెవిరెడ్డి ఇంటి నుంచి వస్తున్న సారెకు ఘన స్వాగతం పలికేందుకు గ్రామాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు ఏర్పాట్లు చేశారు.

ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో గొడవలు పెడతారా?

చంద్రగిరి: ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో బెంచీలకు పసుపు రంగులు అద్ది గొడవలు సృష్టించవద్దంటూ నరసింగాపురం గ్రామస్తులు తెలిపారు. మండల పరిధిలోని నరసింగాపురం గ్రామంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తుడా నిధులతో ప్రతి గ్రామంలో పార్టీలకు అతీతంగా సిమెంటు బెంచీలను ఏర్పాటు చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలు బెంచీలకు పసుపు రంగులు వేయడం మొదలు పెట్టగా గ్రామస్తులు అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడు మించల ప్రవీణ్ కుమార్ పసుపు రంగులు వేయడాన్ని అడ్డుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..త్వరలోనే గ్రామంలో మహాభారత ఉత్సవాలు జరుగుతాయని, ఇలాంటి సమయంలో రాజకీయ రంగులు వేయడం ఏమిటని మండిపడ్డారు. దీంతో ఎస్ఐ అనిత వారిని స్టేషన్‌లో మాట్లాడాలని తీసుకెళ్లారు. రెండు గంటల పాటు కూర్చోబెట్టి, పీడీ యాక్టు కేసు నమోదు చేస్తామని బెదిరించినట్లు వారు తెలిపారు.



బెంచీలకు పసుపు రంగులు వేయడంపై అభ్యంతరం తెలుపుతున్న ప్రవీణ్, గ్రామస్తులు

వేషాల జాతర..

తిరుపతి కల్చరల్: తిరుపతి గంగజాతరలో భాగంగా బుధవారం నుంచి వారం రోజుల పాటు రోజుకో వేషం వేసుకుని భక్తులు తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకోనున్నారు.

- **నేడు బైరాగి వేషం**

గంగజాతర ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు బుధవారం బైరాగి వేషంతో జాతర ఆరంభమవుతుంది. తొలి రోజు చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు బైరాగి వేషం ధరించి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు.

- **బండ వేషం**

రెండవ రోజు భక్తులు బండవేషంలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ.

- **తోటి వేషం**

మూడో రోజు తోటి వేషాలతో దర్శించుకుంటారు.

- **దొరవేషాలు**

కైకాల కులస్తులు దొరవేషం, చాకలి కులస్తులు మంత్రివేషం ధరించి అమ్మవారిని దర్శించుకుంటారు.

- **తిరుమల వెంకన్న సారె**

ఐదవ రోజు సాక్షాత్తు తిరుమల శ్రీవారి చెల్లెలు గంగమ్మకు సారె సమర్పిస్తారు. ఇదే రోజు వివిధ వేషాలతో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు.

- **మాతంగి వేషం**

ఆరవ రోజు భక్తులు మాతంగి వేషాలు ధరించి నగర వీధుల్లో సందడిచేస్తూ అమ్మవారిని దర్శించుంటారు.

- **సున్నపు కుండల వేడుక..**

ఏడోరోజు ఇద్దరు కైకాల కులస్తులు సున్నపు కుండలు వేషాన్ని ధరించి ప్రజలచే పూజలందుకుంటారు.

- **సుగంధ ద్రవ్యాలతో అభిషేకం**

అమ్మవారి జాతరలో చాటింపు రోజు నుంచి మాతంగి వేషం రోజు వరకు విభిన్న రీతిలో చిత్ర, విచిత్ర వేషధారణలతో అలిసిన అమ్మవారిని శాంతింపజేసేందుకు సోమవారం రాత్రి 12 గంటల దాటిన తరువాత అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో ప్రత్యే అభిషేకం చేసి శాంతిపజేస్తారు. ఇదేరోజు అర్ధరాత్రి తర్వాత ఆలయ ఆవరణలో అమ్మవారి విశ్వరూపం కొలువు తీరుస్తారు. బుధవారం వేకువజామున గంగమ్మ ఆలయానికి చేరుకొని పేరంటాలు అమ్మవారి విశ్వరూపం చెంప నరకడంతో జాతర ముగుస్తుంది.

సన్మార్గానికి భగవద్గీత సరైన మార్గం



భగవద్గీత ప్రాధాన్యతపై ప్రచారం చేస్తున్న నిర్వాహకులు

చంద్రగిరి: మానవాళి సన్మార్గంలో నడుస్తూ జీవితాన్ని సార్థకం చేసుకోవడానికి ఏకైక మార్గం భగవద్గీతను అనుసరించడమేనని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు పెంచల నరసయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముంగశిపట్టు, నడింపల్లి, ఐతేపల్లి, పులిత్తివారిపల్లి గ్రామాల్లో భగవద్గీత ప్రాధాన్యతను వివరిస్తూ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే పురాతన పవిత్రగ్రంథం భగవద్గీత అన్నారు. అనంతరం ఆయన గ్రామాల్లోని ప్రజలకు 101 త్రైతసిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల గురించి వివరించారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగా అధ్యయనంలో 16, 17 శ్లోకాలు త్రైతసిద్ధాంతానికి ఆధారమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో ఇద్దరికి ఏడాది జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం చెట్లను నరికి తరలిస్తున్న కేసులో ఇద్దరికి ఏడాది చొప్పున జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.5,500 జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ జడ్జి కోర్టు జడ్జి శ్రీకాంత్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2010 నవంబర్ 26వ తేదీ ప్రొద్దుటూరు ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులకు వచ్చిన సమాచారంతో ప్రొద్దుటూరు రేంజ్, ప్రొద్దుటూరు బీట్, కన్నెలవాగు చెరువు అటవీ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఏడుగురు వ్యక్తులు 732 కిలోల బరువు గల 21 ఎర్రచందనం దుంగలను తరలిస్తూ ఫారెస్ట్ అధికారుల కంటపడ్డారు. ఫారెస్ట్ అధికారులను చూసి ఐదుగురు పరారవగా.. వైఎస్సార్ కడప జిల్లా, కాజీపేట మండలం, కూనవారిపల్లికి చెందిన టీ.ఓబుల్‌రెడ్డి, ఆర్.సుబ్బిరెడ్డి ఫారెస్ట్ అధికారులకు పట్టుబడ్డారు. ఇద్దర్నీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా.. నేరం రుజువు కావడంతో ఇద్దరికీ శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కోర్టులో లొంగుబాటు

పాకాల : స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో దామలచెరువు అశోక్‌కుమార్ హత్య కేసులో ప్రధాన అనుమానితుడు ప్రకాష్‌రాజ్(కమ్మ) మంగళవారం న్యాయమూర్తి ముందు లొంగిపోయాడు. ఈ నెల 1వ తేదీన దామలచెరువుకు సమీపంలో హత్యకు గురైన అశోక్‌కుమార్ హత్య కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని న్యాయమూర్తి ముందు వివరించారు. ఈ మేరకు పోలీసుల నుంచి తనకు రక్షణ కల్పించాలని విన్నవించారు. పరిశీలించిన న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. న్యాయమూర్తి ఆదేశాలతో ప్రకాష్‌రాజ్‌ను చిత్తూరు జైలుకు తరలించారు.

ఐదు సెంటర్లలో నేడు ఐసెట్

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లావ్యాప్తంగా ఐదు పరీక్షా కేంద్రాలలో ఐసెట్–2025 బుధవారం నిర్వహించనున్నారు. జిల్లాలో గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, పుత్తూరు ఎస్వీ పెరుమాళ్ ఇంజనీరింగ్, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, తిరుపతి జూపార్క్ సమీపంలోని ఐయాన్ డిజిటల్ సెంటర్లలో పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పరీక్షకు తిరుపతి జిల్లాలో సుమారు 5వేల మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

స్కీముల పేరిట సర్కారు స్కాములు

- కుట్టుమిషన్ల పంపిణీ అంటూ రూ.245 కోట్లు దోచుకుంటున్న పాలకులు
- వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు చిన్నియాదవ్ ఫైర్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు చిన్నియాదవ్, మాధవిరెడ్డి, గీతాయాదవ్, మునికృష్ణ

తిరుపతి మంగళం/తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల అమలులో పూర్తిగా విఫలమై, స్కీముల పేరు చెప్పుకుని దర్జాగా స్కాములు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు చిన్నియాదవ్, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మాధవిరెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గీతాయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో వారు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తిరుపతి డీఆర్‌ఓ నరసింహులుకు కుట్టు మిషన్ల కుంభకోణంపై విచారణ జరపాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చేయూత కింద ఇచ్చే కుట్టు మిషన్‌లను కూడా చంద్రబాబు సర్కారు సక్రమంగా అందించడం లేదన్నారు. కుట్టు మిషన్ల పంపిణీ, టైలరింగ్ శిక్షణకు మొత్తం బీసీ లబ్ధిదారులకు రూ.23 వేలు ప్రభుత్వం కేటాయించిందని, అయితే కుట్టుమిషన్ కొనుగోలుకు రూ.4300, ఒక వ్యక్తికి శిక్షణ ఇవ్వడానికి రూ.3 వేలు చొప్పున ఇలా ఒక్కో బీసీ లబ్ధిదారుడికి కుట్టు మిషన్, శిక్షణకు అయ్యే మొత్తం ఖర్చు రూ.7,300 మాత్రమే అన్నారు. ఈలెక్కన లక్ష మంది లబ్ధిదారులకు అయ్యే ఖర్చు రూ.73 కోట్లు అని, కానీ మొత్తం ఆర్డర్ కాస్ట్ రూ.245 కోట్లు పెట్టడం పాలకుల అవినీతికి నిదర్శనమన్నారు. ఐదేళ్ల జగనన్న పాలన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందించారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిలమంద మునికృష్ణ, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుబాల, పార్టీ నాయకులు రెడ్డిరాణి, మస్తానమ్మ, కల్లూరు లక్ష్మి, విజయలక్ష్మి, లవ్‌లీ వెంకటేష్, రుద్రగోపి తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ పంపిణీలో కుంభకోణం

తిరుపతి కల్చరల్: బీసీ మహిళలకు కుట్టుమిషన్ల పథకం పేరుతో కూటమి ప్రభుత్వం రూ.కోట్ల కుంభకోణానికి పాల్పడి బీసీలను దగా చేసిందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ తిరుపతి నియోజకవర్గ అధ్యక్షుడు తండ్లం మోహన్ యాదవ్ ఒక ప్రకటనలో విమర్శించారు. సుమారు రూ.257 కోట్లు బీసీ మహిళలకు కుట్టు మిషన్ల పథకం ద్వారా సుమారు రూ.167 కోట్లు బీసీల నిధులను దోపిడీదారులకు చేరేలా పథకం అమలు చేస్తున్నారని తెలిపారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

తిరుపతి కల్చరల్: రాస్ ప్రధాన కార్యాలయంలో మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేయడంతో పాటు పేదలకు అన్నదానం చేశారు. అంతకుముందు రాస్ గుత్తా మునిరత్నం 4వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్వీ అరవింద కంటి ఆస్పత్రి వారి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం చేపట్టి 500 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 70 మందిని ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహణకు ఎంపిక చేశారు. కెనరా బ్యాంకు సహకారంతో 30 మంది పేద మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతులకు ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, రాస్ ప్రతినిధులు బాలాజీనాయుడు, సంయుక్త కార్యదర్శి మమత, వికాస్ అధ్యక్షురాలు సమత, ఆర్‌కే ఎంటర్‌ప్రైజెస్ ఎండీ బాలాజీ, కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఉమాపతి, ఎస్వీ అరవింద కంటి ఆస్పత్రి డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ ఆమని, పీఆర్‌ఓ వాసుదేవరెడ్డి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తున్న రాస్ ప్రతినిధులు

పంటలపై ఏనుగుల దాడులు

పాకాల : మండలంలోని పదిపుట్లబైలు పంచాయతీ గుండ్లగుట్టపల్లిలో సోమవారం రాత్రి ఏనుగుల గుంపు పంట పొలాలను నాశనం చేశాయి. మంగళవారం ఉద్యాన శాఖ అధికారి శైలజ ఏనుగులు నాశనం చేసిన టమాటా పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుమారు 1.5 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. అలాగే ఎక్కువ గాలి వీయడంతో దామలచెరువు చుట్టు పక్కల గ్రామాల్లో స్వల్పంగా మామిడి కాయలు నేలరాలినట్లు తెలిపారు. రైతులు మామిడి కాయలు కోయడానికి 10 రోజుల ముందు నీటి తడులు ఇవ్వడం ఆపివేయాలన్నారు. కాయ పక్వ దశకు వచ్చే దశలో ఎకరాకు 6 నుంచి 8 పండు ఈగ బుట్టలను ఐదు అడుగుల ఎత్తులో కట్టుకోవడం వల్ల ఈగ ఉధృతిని అరికట్టవచ్చన్నారు. ఈ పండు ఈగ బుట్టలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని, వివరాలకు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు వనజ, స్థానిక రైతులు పాల్గొన్నారు.



ఏనుగుల దాడిలో నాశనమైన టమాట పంట

గంగమ్మకు వరుణుడి అభిషేకం



తిరుపతి గంగజాతర చాటింపుతో తిరునగరిలో మంగళవారం తొలకరి చిరుజల్లులకు కురిశాయి. ఈ క్రమంలోనే కమ్ముకున్న నల్లమబ్బులతో సాయంత్రం నగరం ఇలా కనిపించింది. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ అనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

గుక్కెడు నీళ్లివ్వండి సామీ..!



నగరపాలక సంస్థ పరిధిలోని శివజ్యోతి నగర్, సాయిబాబా గుడి వెనుక వీధిలో ఉన్న బోరు ఆ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. గత కొంతకాలంగా చేతిపంపు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఆ ప్రాంత వాసులు నగరపాలక సంస్థ అధికారులకు, సిబ్బందికి బోరు రిపేరీ చేయాలని మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో మహిళలకు ప్రతినిత్యం నీటిసమస్య వెంటాడుతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి బోరుకు మరమ్మతులు చేపట్టి గుక్కెడు నీళ్లు వచ్చేలా చూడాలని మహిళలు విన్నవించుకుంటున్నారు.

- తిరుపతి తుడా

ఉన్నత లక్ష్యం వైపు అడుగులు పడాలి



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: విద్యార్థులు శ్రమే ఆయుధంగా ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేస్తే ఆశించిన ఫలితాన్ని పొందవచ్చని ప్రిన్సిపల్ డాక్టర్ ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బైరాగిపట్టెడలోని రిమ్స్ కళాశాలలో మంగళవారం ఎమ్మెస్సీ, ఎంసీఏ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు అవసరమైన అధునాతన అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేందుకు యువత ఆధునిక టెక్నాలజీతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కొండారెడ్డి, ఆనంద్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, విభాగాధిపతులు నిరంజన్ రెడ్డి, మధుర, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.